మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

చేర్యాలలో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, అక్టోబర్ 29 : బీఆర్ఎస్ పట్టణ మహిళా కార్యదర్శి బుడిగే విజయం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు.ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్ గౌడ్, బీఆర్ఎస్ టౌన్ సెక్రటరీ బూరగోని తిరుపతి,నాయకులు పచ్చిమడ్ల సిద్ధిరాములు, బుడిగె శ్రీనివాస్ ఉన్నారు.

పటాకుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 29 : పటాకుల దుకాణాలు ఏర్పాటు చేసేవారు తప్పకుండా అనుమతులు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి సందన్న సూచించారు.సిద్దిపేట అగ్రిమాపక శాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.టపాకాయల దుకాణాల నిర్వహణకు ముందుస్తుగా అనుమతిని పొందాలని..ఆన్‌లైన్‌లో సైతం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.అలా కాకుండా ఇష్టారీతిగా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హుస్నాబాద్‌లో...

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 29: పట్టణంలోని ఎనిమిది పటాకుల దుకాణాలకు అనుమతి మంజూరు చేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఒక్కో దుకాణానికి రెండువేల రుసుంతో నోడ్యూస్ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. గత ఏడాది బస్‌డిపో ప్రాంతంలో ఏర్పాటు చేసిన పటాకుల దుకాణాలకు ఈ ఏడాది నాగారం రోడ్డులో అనుమతులు మంజూరుచేశారు. ఇండ్లకు దూరంగా పటాకుల దుకాణాలు ఏర్పాటు చేయాలనే నిబంధనల ప్రకారం అనుమతి ఇచ్చారు.

మట్టి ప్రమిదలు ఉపయోగించాలి

మట్టి ప్రమిదలు వినియోగించాలని కోరుతున్న చైర్‌పర్సన్ ఆకులరజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 29: దీపావళి సందర్భంగా మట్టి ప్రమిదలు మాత్రమే ఉపయోగించాలని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకన్న కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్‌దివాళి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.మట్టి ప్రమీదలను విక్రయించే దుకాణాలను సందర్శించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ దీపావళి పర్వదినం సందర్భంగా మట్టి ప్రమీదలను మాత్రమే వినియోగించాలని సూచించారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆమె కోరారు. కమిషనర్ టి. మల్లికార్జున్ గౌడ్, వైస్‌చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు నళిని దేవి, స్వర్ణలత, భాగ్యారెడ్డి, సరోజన, పద్మ, రత్నమాల, సుప్రజ, కోఆప్షన్ సభ్యుడు శంకర్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

రామారంలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ అందజేస్తున్న మంద లక్ష్మణ్

రాయపోల్,అక్టోబర్ 29 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని పాఠశాల పూర్వవిద్యార్థి మంద లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండలంలోని రామారం ప్రథమిక పాఠశాలకు చెందిన 65 మంది విద్యార్థులకు పాఠశాల యూనిఫామ్‌తో పాటు పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లు,అంగన్‌వాడీ చిన్నారులకు ఆయన కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో రాయపోల్ మాజీ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరిహర ప్రసాద్,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయు రాజిరెడ్డి, కానిస్టేబుల్ దేవరాజ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సౌజన్య, పీఆర్‌పీ యాదగిరి, అంగన్‌వాడీ టీచర్లు సరస్వతి, పున్నమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

గజ్వేల్, అక్టోబర్ 29: మండలంలోని శ్రీగిరిపల్లి, అక్కారం గ్రామాల మధ్య నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏడీ జగదీశ్‌కు ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు చంద్రమోహన్‌రెడ్డి, బాల్‌చంద్రం రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. రెండు గ్రామాల్లో తరచూ విద్యుత్ అంతరాయం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఒకే లైన్ ఉండడంతో వ్యవసాయం చేసుకునే రైతులకు సమస్యగా మారిందన్నారు. కార్యక్రమంలో బాల్‌రాజు, కన్నయాదవ్, బాలస్వామి, చంద్రం, మాదగారి స్వామి, అల్వాల అశోక్, కుమార్, సురేశ్, గణేశ్ పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన యువకుల అరెస్టు

గజ్వేల్, అక్టోబర్ 29: గంజాయితో ఇద్దరు యువకులు పట్టుబడ్డారు. సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు తెలిపిన వివరాల ప్రకారం ప్రజ్ఞాపూర్‌కు చెందిన మహమ్మద్ అష్రఫ్, ఆకాశపు సాయికుమార్ ప్రజ్ఞాపూర్‌లోని మానస వైన్స్ వద్ద మిర్చి బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి బీహార్‌కు చెందిన రాహుల్ పరిచయమయ్యాడు. అతడు గంజాయి తీసుకొచ్చి ఇవ్వడంతో చుట్టు పక్కల గ్రామాల్లోని యువత, కూలీలకు వీరు అమ్ముతున్నారు. నమ్మదగిన సమాచారంతో వీరిని పట్టుకొని వారి వద్ద నుంచి 335గ్రాముల గంజాయి, రూ.7వేల నగదు, సెల్‌ఫోన్లు, స్కూటీ స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సిద్దిపేటలో సీఐటీయూ నాయకుల నిరసన

సిద్దిపేట,అక్టోబర్ 29: క్యూబాకు అండగా నిలబడదామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేటలోని గాంధీ సెంటర్‌లో అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, బండి మల్లయ్య, సత్యనారాయణ, ప్రసాద్, ఎల్లయ్య, సతీశ్, చందర్, కుమార్, రాజు పాల్గొన్నారు.

సిద్దిపేట డీఎంహెచ్‌వోగా పల్వన్ కుమార్

సిద్దిపేట,అక్టోబర్29: సిద్దిపేట జిల్లా వైద్యాధికారిగా బి.పల్వన్ కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పల్వన్ కుమార్ మెదక్ జిల్లా అదనపు డీఎంహెచ్‌వోగా, వికారాబాద్ జిల్లా డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై సిద్దిపేటకు రానున్నారు. ఇప్పటి వరకు జిల్లా డీఎంహెచ్‌వోగా పుట్ల శ్రీనివాస్ విధులు నిర్వహించిన విషయం తెలిసిందే.

కార్మిక చట్టాలను పక్కాగా అమలు చేయాలి

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 29 : కార్మిక చట్టాలను పక్కాగా అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎడ్ల గురువారెడ్డి భవనలో మంగళవారం ఏఐటీయూసీ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ.. ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేసి కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తుందన్నారు. మల్లేశం,భిక్షపతి, చంద్రం పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

చేర్యాల, అక్టోబర్29: చేర్యాల పట్టణంలోని పంచతంత్ర పాఠశాలలో సిద్దిపేటకు చెందిన తెలంగాణ సూపర్ స్పెషాలిటీ డెంటల్ దవాఖాన ఆధ్వర్యంలో మంగళవారం దంత పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సై నీరేశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు, తల్లిదండ్రులకు సుమారు 200 మందికి డాక్టర్ అరవింద్‌కుమార్ దంత పరీక్షలు చేశారు. అంతకుముందు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పాఠశాల అధ్యాపక బృందం ఎస్సై, డాక్టర్‌ను సన్మానించింది.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

బాధితురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లి, అక్టోబర్ 29 : సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏర్పుల మహేశ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన ముత్యం భవాని అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.11,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాజీ మంత్రి హరీశ్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గొల్లపల్లి కిష్టయ్య, ముత్యం నర్సింహులుగౌడ్, మాజీ ఉపసర్పంచ్ కొండ శ్రీధర్, ముత్యం నాగరాజు గౌడ్, బైరి మహేందర్ పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

బంగ్లావెంకటాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 29: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో పంటరుణమాఫీ చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అక్కారం, బంగ్లావెంకటాపూర్, గిరిపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పదేండ్లలో వ్యవసాయం పండుగలా సాగిందని, రైతు సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అధికారులు, స్థానిక నాయకులకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సహకరించాలన్నారు. సన్నధాన్యంతో పాటు దొడ్డు రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఏపీఎం దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్‌లు బాల్‌చంద్రం, బాపురెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

హుస్నాబాద్‌టౌన్: కొనుగోలు కేంద్రంలో ఎంఎల్ఎస్‌పాయింట్ ఇన్‌చార్జితో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్‌టౌన్,అక్టోబర్ 29: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. ధాన్యం తేమశాతాన్ని పరిశీలించే యంత్రాన్ని పరిశీలించి, ఇప్పటివరకు ధాన్యం ఎంతవరకు కొనుగోలు చేశారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి ఎండీ. జైనులొద్దీన్‌కు సూచించారు. మార్కెట్‌యార్డులోని ఆరుషెడ్లలో ఒక్కటి మాత్రమే ఖాళీగా ఉందని, మిగతా షెడ్లలో ఏమి ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. ధాన్యం ఎక్కువ శాతం వచ్చే అవకాశాలు ఉన్నందున షెడ్లను సరిపడ ఖాళీగా ఉంచేందుకు ప్రయత్నించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్నిరకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

జగదేవపూర్, అక్టోబర్29: దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు పీర్లపల్లి, ఇటిక్యాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి వారు ప్రారంభించారు. ఏవో వసంతరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పీర్లపల్లి, ఇటిక్యాల మాజీ సర్పంచ్‌లు యాదవరెడ్డి, చంద్రశేఖర్ ఎంపీటీసీ కిరణ్‌గౌడ్, మహేందర్‌రెడ్డి మహిళా సంఘం అధ్యక్షులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

భూర్గు శ్రీశైలం దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్29: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి అన్నారు. మంగళవారం మద్దూరులో తాజ్‌మహల్ గార్డెన్‌లో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కామిడి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మద్దూరు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం భూర్గు శ్రీశైలం ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వృత్తికి ఉపాధ్యాయులు వన్నె తీసుకురావాలన్నారు. ఉత్తమ సేవలు అందించడం ద్వారానే ఉద్యోగులకు ఉత్తమ గుర్తింపు లభిస్తుందన్నారు. ఉపాధ్యాయుడిగా భూర్గు శ్రీశైలం అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధరశర్మ, రిటైర్డ్ ఎంఈవో నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖరశర్మ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నాగేందర్, వంగ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చల్లా కరుణాకర్, చేర్యాల, ధూళిమిట్ట మండలాల అధ్యక్షులు కేవీఎన్‌రెడ్డి, వంగ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

సిద్దిపేట కలెక్టరేట్,అక్టోబర్ 29: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులకు సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు,మండల స్థాయి ట్రైనర్లకు ఇంటింటి కుటుంబ సర్వేపై శిక్షణ ఇచ్చారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు అవసరమైన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు నియోజకవర్గానికి ఒకరు చొప్పున మాస్టర్ ట్రైనర్‌ని కేటాయించడం జరిగిందన్నారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాధికారత సాధించాలి

గజ్వేల్, అక్టోబర్ 29: ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం ద్వారా లబ్ధిపొందిన మహిళలందరూ ఆర్థిక సాధికారత సాధించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసుదేవ్ అన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని మహిళా సమైఖ్య భవనంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు.ఆరోగ్య పరిరక్షణలో తమవంతు బాధ్యతగా ఉండాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పిన మహిళలకు 35శాతం సబ్సిడీ వర్తిస్తుందని,అలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ ఇండియా ట్రైనింగ్ పాట్నర్ రఘువర్మ, ఏపీఎం దుర్గాప్రసాద్, సీసీలు, ఎంఎస్‌వోలు పాల్గొన్నారు.

ట్రేడర్లపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 29: హుస్నాబాద్ మార్కెట్ యార్డులో రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ట్రేడర్లపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ కార్యదర్శికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు వల్ల రైతులకు తీరని నష్టాలు జరుగుతున్నదని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కందుకూరి సతీశ్, గోపగాని అరవింద్, తోకల కనుకయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 29 : కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో మంగళవారం స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీఐలో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనలో శిక్షణ పొంది ఉత్తీర్ణులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ ఉప సంచాలకులు సీతారాములు,జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ గణేశ్, ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు హాజరై మాట్లాడారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జియో ఫైబర్ జిల్లా ఇన్‌చార్జి సంతోష్ తెలిపారు. అంతకుముందు ముద్దాపూర్ శివారులో కొత్తగా నిర్మిస్తున్న ఐటీసీ భవన నిర్మాణానికి కరెంట్ మంజూరు కోసం అడిషనల్ డివిజన్ ఇంజినీరు శ్రీనివాస్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ రామానుజ, దుబ్బాక ప్రిన్సిపాల్ కనకయ్య, ఐటీఐ శిక్షణ అధికారి సత్యనారాయణ, ఆర్‌డీడీ శిక్షణ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేయించుకోవాలి

సిద్దిపేట, అక్టోబర్ 29: పట్టభద్రుల ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మెరుగు మహేశ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నిమ్మ రజినీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదిలాబాద్ , కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు గుజ్జరాజు, ఇరుగంటి రమేశ్, ప్రభాకర్, రాజశేఖర్‌రెడ్డి, నాగ రాజుగౌడ్ పాల్గొన్నారు.

ధన్వంతరి జయంతి

ధన్వంతరి భగవాన్ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

చేర్యాల, అక్టోబర్ 29 : మండలంలోని నాగపురి నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో ధన్వంతరి జయంతి నిర్వహించడంతో పాటు జెండాను ఆవిష్కరించారు.నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నాగపురి కనకయ్య, సంఘం ప్రతినిధులు జాలిగామ రమేశ్, నాగపురి సత్యనారాయణ, మిల్కూర్ చందు, అవును రాజు, నాగపురి కనకయ్య, రాసూరు కనకయ్య, శ్రీను, వెంకటేశం, నరేశ్, భాస్కర్, కార్తీక్, మధు, భాను, జనార్దన్, కిరణ్, భరత్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో...

మిరుదొడ్డి, అక్టోబర్ 29 : మిరుదొడ్డి టౌన్‌లో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు పయ్యావుల రాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, గొల్ల రాములు, సంఘం నాయకులు శేఖర్, ఆంజనేయులు, బాలయ్య పాల్గొన్నారు.

కుకునూరుపల్లిలో

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 29 : కుకునూరుపల్లి మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణ మండల సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి భగవాన్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై నాయీబ్రాహ్మణులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. నాయీబ్రాహ్మణ సంఘం మండల ఉపాధ్యక్షుడు సంపత్, కోశాధికారి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా చూడాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్,అక్టోబర్29: ధాన్యం కొనుగోలులో సమస్యలు తలెత్తకుండా చూడాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్ అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలుపై మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లపై మిల్లర్లతో ఆయా జిల్లాల అధికారులు సమావేశం నిర్వహించి మిల్లింగ్‌లో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, ఇతర వివరాలు ఆన్‌లైన్ నమోదులో ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, సివిల్ సప్లై డీఎం ప్రవీణ్, అధికారి తనూజ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

దీక్ష చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేట,అక్టోబర్29: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేటలో ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆముదాల రంజిత్‌రెడ్డి, దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ. 8300 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలలు గడిచినా విడుదల చేయలేదన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్‌కుమార్, జిల్లా సహాయకార్యదర్శి గుండాఅరుణ్, జిల్లా నాయకులు తాడూరు భరత్ కుమార్, కోనేరు ప్రవీణ్, సిద్దిపేట పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్, భాను నాయకులు తిరుపతి, రంజిత్, రమ్య, సుహాసిని, స్వప్న, విష్ణు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా రూ 8300 కోట్ల స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని మంగళవారం సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మధు,నాయకులు ప్రసన్నకుమార్, సుధాకర్, అనిరుద్, నవీన్, రమేశ్, భవానీ, రమ్య, వర్షిత, రాజేందర్ పాల్గొన్నారు.

సిద్దిపేట సకల కళల కోట

సిద్దిపేట, అక్టోబర్ 29 : తెలంగాణ పల్లె సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలని చేపట్టిన కార్యక్రమాన్ని ఉమ్మడి పది జిల్లాల కళాకారులు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని కవి, గాయకుడు, సంగీత దర్శకుడు వరంగల్ శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని శివానుభవ మండపంలో నూరేండ్ల నా ఊరు గేయ కావ్యానికి గాయినీ గాయకుల ఎంపిక మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా కళాకారుల సమక్షంలో జరిగింది. న్యాయ నిర్ణేతగా వరంగల్ శ్రీనివాస్ వ్యవహరించారు. అనంతరం వరంగల్ శ్రీనివాస్‌కు స్థానిక కళాకారులు గౌరవ సన్మానం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. చికోడు నరసింహులు, మర్పడగ యాదగిరి, వెంకటాపురం రవి, ముక్కపల్లి శ్రీనివాస్, డప్పు బాబు, వివి కన్నా, గోల్కొండ బుచ్చన్న, జూపాక శివ, మల్లిక్ తేజ, కమ్మల ప్రవీణ్ కుమార్, మామిడి సాయిలు, కొమ్ము రవీందర్, ఏర్పుల క్రాంతి, సంబరాల బాలరాజు, పెద్దోళ్ల నరేశ్, సంధ్య బిక్కనూరి, రేష్మ, పల్లవి, మౌనిక, స్వాతి పాల్గొన్నారు.

సీపీఎం మండల మహాసభలను జయప్రదం చేయాలి

కొమురవెల్లి, అక్టోబర్ 29 : సీపీఎం మండల మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తాడూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నవంబర్ 12న ఐనాపూర్, గజ్వేల్ పట్టణంలో డిసెంబర్ 1వ, 2వ తేదీల్లో సీపీఎం మండల మూడో మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, బి.కృష్ణారెడ్డి, తేలు ఇస్తారి, వుల్లంపల్లి సాయిలు, బక్కెల్లి బాలకిషన్ పాల్గొన్నారు.

మల్లన్నకు రూ. 62లక్షల ఆదాయం

దేవాదాయ శాఖ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

చేర్యాల, అక్టోబర్29: కొమురవెల్లి మల్లన్న జాతరలో భాగంగా హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన తలనీలాలు పోగు చేసుకునే లైసెన్స్ హక్కు కోసం మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాట ద్వారా మల్లన్నకు రూ. 62లక్షల 37వేల ఆదాయం సమకూరింది. ఒక సంవత్సరం కాలానికి వేలం పాటలో సిద్దిపేటకు చెందిన రుద్ర ఎంటర్‌ప్రైజెస్ హక్కును సంపాదించింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి బాలాజీ, చంద్రశేఖర్, పర్యవేక్షకులు సురేందర్, శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన ఆలయ సిబ్బంది

రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతు కొండిబాను ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో కొమురవెల్లి ఆలయ ఈవో బాలాజీ, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చకుడు సుర్యకుమార్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఏఈ భాస్కర్, జూనియర్ అసిస్టెంట్ మధుకర్, శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కొమురవెల్లి మల్లన్నస్వామి శేషవస్త్రంతో పాటు ప్రసాదాన్ని కమిషనర్‌కు అందజేశారు.

చర్చి నిర్మాణానికి అనుమతులు లేవు

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 29 : కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి మధిర గ్రామం సార్లవాడలో నిర్మిస్తున్న చర్చికి ఎలాంటి అనుమతులు లేవని కొండపాక మండల ఆర్ఐ చెట్లపల్లి బాలకృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం కొండపాక తహసీల్దార్ దిలీప్‌నాయక్ ఆదేశాల మేరకు తిమ్మారెడ్డిపల్లిలో రెండు రోజుల క్రితం చర్చికోసం నిర్మిస్తున్న గోడలను కొంతమంది కూల్చిన ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి చర్చి నిర్మాణానికి అనుమతి ఇవ్వలేదన్నారు. కొందరు గ్రామస్తులు, బీజేపీ మండల నాయకుల తో కలిసి చర్చి కోసం నిర్మిస్తున్న గోడలను కూలగొట్టారు. ఈ విషయమై సువార్తయ్య కుకునూరుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి వారిని జిల్లా కోర్టులో రిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సోమవారం అర్ధరాత్రి కుకునూరుపల్లి పీఎస్‌కు చేరుకొని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన నిర్మాణాన్ని కూల్చితే కేసులు ఎలా పెడతారని గజ్వేల్ ఏసీపీతో వాదించారు. చర్చి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, రెవెన్యూ అధికారులతో కలిసి పూర్తిస్థాయి విచారణ జరిపి అక్రమంగా చర్చి నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీ పట్టుబట్టారు. చర్యలు తీసుకుంటామని ఎంపీకి ఏసీపీ హామీ ఇవ్వడంతో మంగళవారం తెల్లవారుజామున పీఎస్‌నుంచి వెళ్లిపోయారు.ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న బీజేపీ నాయకులకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దుబ్బాక తహసీల్దార్‌గా సంజీవ్‌కుమార్

దుబ్బాక,అక్టోబర్ 29: దుబ్బాక తహసీల్దార్‌గా సంజీవ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దుబ్బాక తహసీల్దార్ వెంకట్‌రెడ్డి సిద్దిపేట రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి బదలీపై వెళ్లారు. మద్దూర్ తహసీల్దార్‌గా పని చేసిన సంజీవ్ కుమార్ దుబ్బాక తహసీల్దార్‌గా వచ్చారు.

పత్తిపంట పరిశీలన

చేర్యాల, అక్టోబర్ 29 : మండలంలోని కడవేర్గులో నూజీవీడు సీడ్స్ ఆద్య-1134 పత్తి పంటను మంగళవారం నూజీవీడు కంపెనీ ఆర్ఎం శ్రీకాంత్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆద్య-1134 పత్తి పంట అన్ని రకాల చీడపీడలను తట్టుకుంటుందన్నారు. గులాబీ రంగు పురుగు ఉధృతి నుంచి తప్పించుకుంటుందన్నారు. దీంతో క్రిమిసంహారక మందుల ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీరామంజనేయ ట్రేడర్స్ యజమాని కొండల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు ఇవ్వని ప్రభుత్వం

తొగుట అక్టోబర్ 29: సంవత్సరం గడుస్తున్నా వీఆర్ఏల వారసులకు రాష్ట్ర ప్రభుత్వం నియామక పత్రాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నదని వీఆర్ఏ వారసుల జిల్లా అధ్యక్షుడు గుడుమల్ల రాజలింగం అన్నారు. మంగళవారం తొగుటలో 61 ఏండ్ల వీఆర్ఏల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 20,555 మంది వీఆర్ఏలు ఉండగా అందులో జీవో నెంబర్ 18.85 ప్రకారం 16,750 మందికి మాత్రమే రెగ్యులర్ చేసి ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పించిందన్నారు.61 ఏండ్లు దాటిన 3,797 మంది వీఆర్ఏల వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మండి పడ్డారు. భిక్షపతి, రాణి,యాదయ్య, మల్లయ్య, రామస్వామి, రామకృష్ణ, యాదయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకోవాలి

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 29 :ప్రతి స్త్రీలో దైవ స్వరూపిణి అమ్మవారిని దర్శించాలని మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. మంగళవారం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఉమామహేశ్వర క్షేత్రంలో గంగిశెట్టి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ దేవాలయాలను దర్శిస్తూ దైవ కార్యక్రమాల్లో నిమగ్నం కావాలన్నారు. కార్యక్రమంలో భక్తులు, మాధవానంద సరస్వతి స్వామి శిష్య బృందం పాల్గొన్నారు.

పౌరుషాల పిల్లగాడు ప్రోమో ఆవిష్కరణ

గజ్వేల్, అక్టోబర్ 29: సినీ నటుడు అనిల్ మొగిలి, ఫోక్ వీడియో డ్యాన్సర్ జానులిరిలు కలిసి నటించిన ఫోక్ ఆల్బమ్ పౌరుషాల పిల్లగాడు ప్రోమోను మంగళవారం ప్రజ్ఞాపూర్‌లో డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, రాజేశ్వర్‌రావు ఆవిష్కరించారు.

వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అశోక్

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 29 : వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కెమ్మసారం అశోక్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య మం గళవారం అశోక్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల సాధనకు తనవంతు కృషి చేస్తానన్నారు తనపై నమ్మకాన్ని ఉంచి ప్రధాన కార్యదర్శిగా నియమించిన ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 29 : చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా ముదిగొండ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహరించిన రాష్ట్ర అధ్యక్షుడు వీరమోహన్, ఉపాధ్యక్షుడు భగవాన్‌కు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.